# సౌర విద్యుత్‌తో తగ్గనున్న వాయు కాలుష్యం

కలెక్టర్ డీకే బాలాజీ


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ

**చిలకలపూడి(మచిలీపట్నం):** ప్రతి ఒక్కరూ సౌర్య విద్యుత్‌ను వినియోగించుకుని వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి సాయిబాబా గుడి వరకు సూర్య ఘర్ యోజన పథకం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహాలపై సౌర శక్తి పలకలు ఏర్పాటుతో సొంతంగా వినియోగదారులే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు ఇస్తున్న రాయితీలను పొందటమే కాకుండా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. దీనికి వివిధ బ్యాంకులు కూడా రుణాలు అందిస్తున్నాయన్నారు. గృహాలకు సరఫరా అవుతున్న విద్యుత్ చాలా వరకు థర్మల్ పవర్ విద్యుత్ ద్వారా వస్తోందని, అందుకు బొగ్గును కాల్చటం ద్వారా ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో ఈ కారణంగా వాయు కాలుష్యం పెరుగుతోందన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించటం ద్వారా వాయుకాలుష్యం తగ్గించటంలో ప్రజలు ముందుకు రావాలన్నారు.

**మంజూరు పత్రాలు అందజేత**

**అవనిగడ్డ:** సోలార్ విద్యుత్ వినియోగంలో నియోజకర్గం రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. శనివారం అవనిగడ్డలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద పీఎం సూర్య ఘర్ 300వ ప్లాంటు మంజూరు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలు, సబ్సిడీ వివరాల కరపత్రాలు ఆవిష్కరించారు. 300వ పీఎం సూర్య ఘర్ ప్లాంటు లబ్ధిదారు విస్సంశెట్టి శర్వాణికి సబ్సిడీ మంజూరు పత్రాలు అందజేశారు. అవనిగడ్డ సబ్ డివిజన్‌లో 300 సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లు ఏర్పాటు లక్ష్యం సాధించిన సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ పథకాన్ని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించిన విద్యుత్ శాఖ అధికారులను అభినందించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ భీమా సుధాకర్, డీఈఈ నడకుదుటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీసీటీఓ స్వరూపరాణి, ఏఈఈలు జి.వెంకటరాజు, తోట ప్రసాద్, గోపీచంద్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రక్షణ చట్టాలపై అవగాహన అవసరం



**బంటుమిల్లి:** విద్యార్థులు పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునే సమయములోనే చదువుతో పాటు వ్యక్తిగత, కుటుంబ రక్షణ కోసం చట్టాల గురించి తెలుసుకోవాలని మండల న్యాయ సేవాధికార కమిటి చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక శ్రీ సాయిసిధార్థ జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు పోక్సో చట్టం, బాలికల వేధింపులు, మైనర్ వివాహాలు తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్యాంబాబు చట్టాల నుంచి లభించే రక్షణను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ పిట్టల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాయపురెడ్డి నాగసుధ, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రొయ్యలసాగులో ఆధునిక పద్ధతులు మేలు



**చిలకలపూడి(మచిలీపట్నం):** రొయ్యల సాగులో సంప్రదాయ పద్ధతులకు బదులుగా శాస్త్రీయ విధానాలను అనుసరించటం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, ఆ దిశగా ఆలోచన చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం సాయంత్రం జిల్లాలోని ఆక్వా రైతులకు, బయో శాస్త్రీయ విధానంలో చేపట్టే రొయ్యలసాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ జేమ్స్ కుక్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ జోస్ డొమింగోస్ బయోరాస్ శాస్త్రీయ విధానంలో చేపట్టే రొయ్యలసాగు విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ విధానంలో గంటా సాయిరామ్ చేపట్టిన సాగును సందర్శించి మెలకువలు తెలుసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఇరిగేషన్ ప్రోగ్రాం, ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకాలతో ఆర్థిక సహకారం అందిస్తోందని ఆసక్తి గల రైతులు ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి ఎ. నాగరాజు పాల్గొన్నారు.

### ఘనంగా గ్యార్మీ వేడుకలు

**చల్లపల్లి:** మహబూబె సుభానీ గ్యార్మీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇస్లాంనగర్‌కు చెందిన ముస్లింలు పెద్ద ఎత్తున జెండాలను రథంపై ఉంచి చల్లపల్లి పురవీధుల్లో శుక్రవారం రాత్రి ఊరేగించారు. యువకులు రథం ముందు చిందులు వేశారు. విద్యుత్ దీపాల వెలుగులో ఊరేగింపు సాగింది.

### ఆటస్థలం అభివృద్ధికి సాయం


**గూడూరు:** స్థానిక హైస్కూల్ ఆట స్థలం బాగు చేయించడానికి పాఠశాల పూర్వ విద్యార్థిని నిమయ తల్లిదండ్రులు కాసుల నాగరాజు, ఉండి రాణి దంపతులు రూ.5 వేలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పదవి తరగతి పరీక్షల్లో తమ కుమార్తె 510 మార్కులు సాధించడం వెనక పాఠశాల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇతర ఉపాధ్యాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థుల మానవహారం



**నాగాయలంక:** స్థానిక మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాగాయలంకలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం ప్రదర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు సైకిళ్ల ర్యాలీ జరిపి, మానవహారం నిర్మించారు. ఎంపీడీవో కె.ఎం.చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతిజ్ఞచేయించారు. కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, వర్లె సుమన్, వెలుగు, పంచాయతీరాజ్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

### గగనతలం కనువిందు



**నాగాయలంక:** స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ పశ్చిమ దిక్కున శనివారం సాయం సంధ్యవేళ సూర్యాస్తమయం ముగిశాక ఓ గంట పాటు గగనతలం కనువిందు చేస్తూ సందర్శకులను అలరించింది. ఆకాశంలో అగ్ని కణాలు ఎగిసి పడినట్లు.. మేఘ పర్వతాలు కృష్ణా నదిలోకి ఊడి పడినట్లు శోభాయమానంగా ఆవిష్కృతమైన దృశ్యాలను సందర్శకులు, ప్రకృతి ప్రేమికులకు ఆస్వాదిస్తూ తమ మొబైల్స్‌లో బంధిస్తూ, సెల్ఫీలతో సందడి చేశారు. ఆకాశం నుంచి పర్వతాలు విరిగి పడతున్నట్లు కారుమబ్బులు ఆవిష్కృతమైతే వాటి ప్రతిరూపం ఎరుపెక్కిన కృష్ణమ్మను ఆవరించి సొగసైన ప్రకృతికి దర్పణం పట్టింది.

# పేర్ని నానిని విమర్శించే స్థాయి వారికి లేదు

వైఎస్సార్ సీపీ నాయకులు


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**మచిలీపట్నంటౌన్:** టీడీపీలో చోటా నాయకులుగా చలామణి అవుతున్న వారు రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకటరామయ్య (నాని)పై విమర్శలు చేయటం వారి అవివేకానికి నిదర్శనమని పలువురు వైఎస్సార్ సీపీ జిల్లా, నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మండలి మాజీ జిల్లా చైర్మన్, వైఎస్సార్ సీపీ సౌత్ మండల అధ్యక్షుడు జన్ను రాఘవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గణేశన రమేష్‌బాబు మాట్లాడుతూ టీడీపీకి చెందిన చోటా నాయకులు బందరు అభివృద్ధిపై మాట్లాడుతున్నారని, బందరు ప్రాంతాన్ని అన్ని విధాలుగా పేర్ని నాని హయాంలోనే అభివృద్ధి చెందిందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. పోర్టు, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్, కృష్ణా యూనివర్సిటీ, రహదారుల అభివృద్ధి ఇలా ఎన్నో అభివృద్ధి పనులన్నీ పేర్నినాని హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేశారు. ఈ అభివృద్ధిని చూసి సిగ్గు, శరం, ఎవరికి ఉండాలో టీడీపీ నాయకులే గ్రహించాలన్నారు. ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను కొంచమైనా తెలుసుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు పెట్టించి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేయడం లేదా అని ప్రశ్నించారు. మద్యం దుకాణంలో కంటే బెల్ట్ షాపుల్లో మద్యం రేటుకు రూ.70 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేయటం అబద్ధమాఅని వారు ప్రశ్నించారు. గతంలో నీరు-చెట్టు పేరుతో దోచుకున్నారని విమర్శించారు. నేడు మీరు చేస్తున్న అవినీతిపై టీడీపీ కార్యకర్తలే ముక్కు మీద వేలేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జవ్వా నాగరాజు, నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య, వ్యవసాయ విభాగం నార్త్ మండల అధ్యక్షుడు గడిదేసి డేవిడ్‌రాజు, వాడపాలెం, సీతారాంపురం సర్పంచ్‌లు మేడిశెట్టి రాజా, మురారి కోటి లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి


మల్లవోలులో దుకాణాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

**గూడూరు:** దీపావళిని పురస్కరించుకుని మండల పరిధిలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ముందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటుకు అగ్ని మాపక శాఖ, పోలీసు అధికారులతో కలిసి స్థలాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో 7 దుకాణాలకు అనుమతులు ఇచ్చామన్నారు. దుకాణదారులు నిబంధనల ప్రకారం అమ్మకాలు చేయాలని స్పష్టం చేశారు. అగ్ని మాపక శాఖ అధికారి జక్కంపూడి ఆంజనేయులు, ఆర్ఐ ఝాన్సీ రాణి, వీఆర్వో వరప్రసాద్ పాల్గొన్నారు.

**13 దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు**

**బంటుమిల్లి:** ఈ నెల 20వ తేదీన జరగనున్న దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో 13 టపాసుల దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేసినట్లు బంటుమిల్లి ఫైర్ ఆఫీసరు గరికపాటి రామమోహన్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆవరణలో దుకాణాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అర్తమూరు, పెదతుమ్మిడి గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాలను తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఎస్ఐ గణేష్‌కుమార్లతో కలసి స్థల పరిశీలన చేశామని ఫైర్ ఆఫీసరు పేర్కొన్నారు.

# సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తోనే విద్యార్థి మృతి

కార్యదర్శి మాధవీలత


గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్న మాధవీలత

**మోపిదేవి:** మోపిదేవిలోని మహాత్మాజ్యోతిరావు పూలే ఏపీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆరేవరపు భార్గవ్(11) రెండు రోజుల క్రితం సడన్ కార్డియక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు గురుకుల పాఠశాల ఎమ్‌జేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి మాధవీలత తెలిపారు. విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసి మోపిదేవి గురుకుల పాఠశాలను శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్, స్టాఫ్ నర్స్‌తో సమావేశం నిర్వహించారు. విద్యార్థి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓతో ఫోన్లో సంప్రదించగా విద్యార్థి మృతికి గల కారణం ఆయాసం వల్ల సడన్ కార్డియాక్ అరెస్ట్ అని తెలిపినట్లు ఆమె వివరించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇలాంటి సంఘటనలు మరోసారి పునారవృతమైతే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి, స్టాఫ్ నర్సు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థి మృతికి కారణాల రిపోర్ట్ అందలేదు**

**మోపిదేవి:** స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి బార్గవ్ మృతికి సరైన ఆరోగ్య సమస్య రిపోర్టు అందలేదని జిల్లా మలేరియా అధికారి బి.రామారావు తెలిపారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మోపిదేవి మహాత్మా జ్యోతిభాపూలే ఏపీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి మృతిపై డీఎంవో శనివారం పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి పూర్తి రిపోర్టు వచ్చిన తరువాతనే మృతికి గల కారణాలు తెలుస్తాయని వివరించారు. అనంతరం పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 382 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 38 మంది విద్యార్థులు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నట్లు మోపిదేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏ అనిల్ కుమార్ తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పీఎస్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### కంటి ఆపరేషన్లకు 21 మంది ఎంపిక

**చల్లపల్లి:** స్థానిక నర్రా సాయిబాబు రమాదేవి మల్టిపర్పస్ సెంటర్లో లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 21 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. కంటి వైద్యులు వెంకట్రావ్ 45 మందిని పరీక్ష చేసి 21 మందిని ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపికచేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని రాజ్‌కుమార్, నర్రా సాయిబాబు, సభ్యులు జూపూడి సాయి, అంబటి శంకరరావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి శిక్షణ

**చల్లపల్లి:** స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో చల్లపల్లి, మోపిదేవి మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.భారతి, కె.అరుణలు ధాన్యం సేకరణలో పాటించాల్సిన నియమనిబంధనలపై శిక్షణ ఇచ్చారు. చల్లపల్లి, మోపిదేవి మండలాల తహసీల్దార్‌లు డి.వనజాక్షి, ఎం.హరినాథ్, ఎంపీవోలు కె.మురళీకృష్ణ, కె.హెబ్సిబా, వీఆర్‌ఓలు, వీపీఏలు, టీఏ లు,పీఏసీఎస్ సీఈఓలు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

**పెడన:** మండల పరిధిలోని కవిపురం పీఏసీఎస్ సభ్యురాలు గంధం రమాదేవి మృతిని పురస్కరించుకుని శనివారం సొసైటీ ప్రతినిధులు కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. సొసైటీ చైర్మన్ పుట్టి శ్రీనివాసరావు, సభ్యులు, కార్యదర్శి జన్యావుల కృష్ణంకర్ తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం

**చిలకలపూడి(మచిలీపట్నం):** జీఎస్టీ తగ్గింపు ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరిందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. వారం రోజులుగా జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న షాపింగ్ ఫెస్టివల్‌కు శనివారం ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో లక్కీడ్రా నిర్వహించి విజేతలకు ప్రథమ బహుమతిగా టెలివిజన్, ద్వితీయ బహుమతిగా రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతిగా రోల్డ్‌గోల్డ్ నగలను అందించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, డీఆర్వో కె. చంద్రశేఖరరావు, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కల్పన, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నందీశ్వరునికి అభిషేకాలు

**నాగాయలంక:** బహుళ త్రయోదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శ్రీనందీశ్వరునికి శనివారం రాత్రి పంచామృతాభిషేకాలు, రామలింగేశ్వరునికి విశేష పూజ, హారతులు జరిపారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో నందీశ్వరునికి అభిషేకాలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. తలశిల రఘుశేఖర్, ఉప్పల బజ్జి పర్యవేక్షించారు. గ్రామస్తులు, భక్తులు నందీశ్వరుని అభిషేకించి స్వామివారిని దర్శించుకున్నారు.

### దాడి కేసులో నిందితుల అరెస్ట్

**బంటుమిల్లి:** మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో ఇరువురి మధ్య పాత గొడవల నేపద్యంలో జరిగిన దాడి కేసులో వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ గణేష్‌కుమార్ సమాచారం మేరకు గ్రామానికి చెందిన 61 సంవత్సరాల వృద్ధురాలు బొల్లా నరసమ్మకు అదే గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగమునేంద్రరావుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ గొడవల నేపద్యంలో నాగమునేంద్రరావు గుడివాడ ధనియాలపేటకు చెందిన ఎనిమిదిమందితో ఈ నెల 17వ తేదీన దాడి చేయించాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ నరసమ్మ బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఆరుగురు మహిళలు, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

### వీధి లైట్లు ప్రారంభం

**పెడన:** పట్టణ పరిధిలోని పల్లోటి లే అవుట్‌లో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన వీధి లైట్లను శనివారం రాత్రి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు ప్రారంభించారు. మున్సిపాలిటి జనరల్ ఫండ్స్ రూ.3.60 లక్షలతో పల్లోటి స్కూలు నుంచి లే అవుట్ వరకు వీధి స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటి అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# వృత్తి శిక్షణతో భవిష్యత్తుకు మేలు

**పెడన:** యువతకు చదువుతోపాటు వృత్తి విద్యలో శిక్షణ పొందితే భవిష్యత్తుకు మంచి మార్గం అవుతుందని మచిలీపట్నం పట్టాభి గ్రామీణ బ్యాంకు శిక్షణ కేంద్రం డైరెక్టరు బి.స్వర్ణశ్రీ అన్నారు. శనివారం స్థానిక విజయానంద డిగ్రీ కాలేజీలో ఎచీవర్స్ డే- 2025 కార్యక్రమం నిర్వహించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 15 నుంచి 45 రోజులపాటు టాలీ, కంప్యూటర్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తూ వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. సీనియర్ న్యాయవాది లక్కిశెట్టి బాలాజీ, ప్రిన్సిపాల్ టి.మధుసూదనరావు, డైరెక్టరు సుధీర్, సెక్రటరీ జ్యోతిరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

# ఆలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలి

**మోపిదేవి:** దేవస్థాన ప్రాంగణంలో సిబ్బంది శుభ్రత, పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్పష్టంచేశారు. మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగనంలో శుభ్రత, పరిశుభ్రతపై అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు నిత్యం వస్తుంటారన్నారు. ఆలయ సిబ్బంది ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత పాటించి, పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, చెన్నకేశవ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కేయూలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో..**

**కోనేరుసెంటర్:** కృష్ణా విశ్వవిద్యాలయంలోని పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బందరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు యూనివర్సిటీ చుట్టుపక్కల గ్రామాలైన రుద్రవరం, శారదనగర్, గుండుపాలెం, కోన, పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాలు, డ్రగ్స్, స్వచ్ఛత లాంటి అంశాల మీద అవగాహన కార్యక్రమాలు, బ్లీచింగ్ చల్లించడం లాంటి కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించారు. వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఆర్. దుర్గాప్రసాద్, కె.కవిత, ఎ.శివశేషారెడ్డి, డాక్టర్ హనుమంతరావు, విజయ శేఖర్, సల్మా తదితరులు పాల్గొన్నారు.

**ఘంటసాల:** మండలంలోని ఘంటసాలపాలెంలో పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్త నిర్వహణ, తదితర అంశాలపై ప్రజలకు, విద్యార్థులకు డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ దోనె రజనీ తెలియజేశారు. ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో బి.అర్జునరావు, దోనె వెంకటేశ్వరరావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిట్టూర్పు గ్రామంలో సర్పంచ్ జి.వెంకటేశ్వరరావు, కొడాలి గ్రామంలో సర్పంచ్ సీహెచ్.రాణిలతో కలసి ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు మొక్కలు నాటారు. సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈవోలు నాగమణి, నయీమ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్, ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామస్తులు, నేతలు పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన శాస్త్రవేత్తలు**

**ఘంటసాల:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు శనివారం మొక్కలు నాటారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మూడవ శనివారం మొక్కలు నాటడం, పర్యావరణంపై మనకున్న బాధ్యతని గుర్తు చేసుకుంటున్నామని తెలిపారు. అనంతరం కేవీకే ప్రాంగణంలో మొక్కలు నాటారు. కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతు వేమూరి రత్నగిరి, ఇతర రైతులు పాల్గొన్నారు.

# 21 నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా ఆటలపోటీలు

**గూడూరు:** ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్-14 ,17 బాలుర, బాలికల విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ మత్తి అరుణ కుమారి తెలిపారు. ఈనెల 21న గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ, 22న గుడివాడ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో వాలీబాల్, పడమట కేబీసీ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యాండ్ బాల్, 23న ఈడుపుగల్లు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్, విజయవాడ మొగల్రాజపురంలో పి.బి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, జిమ్నాస్టిక్స్, 24న తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీచ్ వాలీబాల్, 25న అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్ బాల్, బేస్ బాల్, 27న కనసానిపల్లె ఎలైట్ క్రికెట్ గురుకుల అకాడమీలో అండర్-14 బాలుర క్రికెట్ సెలక్షన్స్, 28న గుడివాడ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఖోఖో, కనసానిపల్లె ఎలైట్ క్రికెట్ గురుకుల అకాడమీలో అండర్-17 బాలుర, బాలికల క్రికెట్ సెలక్షన్స్, 29న గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, విజయవాడ ఎమ్మెస్సార్ హాల్‌లో చెస్ సెలక్షన్స్, 30న గుడివాడ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో అండర్-17 విభాగం అథ్లెటిక్స్, గన్నవరం కేవీఆర్ కిషోర్ ఇండోర్ స్టేడియంలో అండర్-17 బ్యాడ్మింటన్, 31న గుడివాడ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో అండర్-14 అథ్లెటిక్స్, గన్నవరం కేవీఆర్ కిషోర్ ఇండోర్ స్టేడియంలో అండర్- 14 బ్యాడ్మింటన్, పడమట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యోగ సెలెక్షన్స్ జరుగుతాయన్నారు.

# రీ సర్వేలో మార్పులు ఉంటే చెప్పండి

**వెంకటాపురం(మోపిదేవి):** రీ సర్వేలో ఏమైనా అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఎం.హరినాథ్ సూచించారు. మండలంలోని వెంకటాపురంలో సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ గత నెల రోజులుగా గ్రామంలో రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. రీ సర్వే పూర్తియ్యిందని, ఏదైనా అనుమానాలు, పేర్లు మార్పు, సర్వే నంబర్ మార్పు వంటివి ఉంటే సవరించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ (డీఎల్ఆర్)లోని వివరాలను సభలో రైతులకు చదవి వినిపించారు. రీ సర్వే డీటీ ముక్కా ప్రసాదరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవాలి

**మోపిదేవి:** సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిలో బాగంగా ఆర్ఏఎంపీ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని ఎంఎస్ఎంఈ సెక్టార్ అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర భూపాల్ తెలిపారు. మండలంలోని మోపిదేవి స్త్రీ శక్తి భవనంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యం రిజిస్ట్రేషన్ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు, వివిధ రాయితీలు అందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్ నందు నమోదు చేయడం కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఈ ఉద్యం రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ డి శ్రీను, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

# దాత సహకారంతో మౌలిక వసతులు

**ఘంటసాల:** దాత గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుత్తికొండ కళ్యాణ్ బాబు సహకారంతో తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, చేతిపంపు ఇతర పనులను రూ.75 వేలు వెచ్చించి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, కళ్యాణ్‌బాబు, తుమ్మల చౌదరి బాబు, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, డీటీ బి.కనకదుర్గ, రీసర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, నేతలు కె.చిట్టిబాబు, జి.బాబు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**ప్రకటన**

[illegible]

**ప్రకటన**

[illegible]

**ప్రకటన**

[illegible]

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
బజారు బ్రాంచ్ (01596), మచిలీపట్నం, కృష్ణాజిల్లా

APPENDIX-IV **స్వాధీనత ప్రకటన** (రూల్-8(1)) (స్థిరాస్తి కొరకు)

[illegible] ... (Home Loan A/c. No's.36811951119, Home Loan A/c.no.36875250255, Home Top Up Loan A/c.No.37486373431, Suraksha Loan A/c.no.36878542675, Suraksha Loan A/c.no.36878552865) వారు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.1,08,24,079/- ... మరియు తేది.11-08-2025 వరకు ... తేది.11-08-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. ... తేది.15-10-2025న స్వాధీనత ... [illegible] ... రూ.1,08,24,079/- మరియు తేది.12-08-2025 నుండి ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచ్ (01596), మచిలీపట్నం, కృష్ణాజిల్లా ... [illegible]

**స్థిరాస్తి వివరములు**

కృష్ణాజిల్లా, మచిలీపట్నం ... వార్డు నెం.20, ... డోర్ నెం.20/342-36, డోర్ నెం.20/313-36-ఓ, ఆర్.యస్.నెం.378/1, 378/2, 379/1బి & 2, ప్లాటు నెం.63 ... 223 ... డాక్యుమెంట్ నెం.3090/2014. తేది:16.06.2014 ప్రకారం ... [illegible]

తేది : 15-10-2025 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : మచిలీపట్నం — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా